క్లుప్తంగా

క్రీడాకారులు మెరుగైన ఆటతీరు ప్రదర్శించాలి



విజేతలను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: క్రీడాకారులు క్రీడల్లో మెరుగైన ఆటతీరును ప్రదర్శించాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం జాతీయా ఓపెన్ సైక్వాన్ ఛాంపియన్ షిప్ సివిల్‌గ్రీ కున్‌సే డెమో పోటీలలో గెలుపొందిన విజేతలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు సైక్వాన్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించి పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్స్ ఖాజాహుస్సేన్, షబ్బీర్ హుస్సేన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



టీచర్ సుబ్రహ్మణ్యంను సన్మానించిన దృశ్యం

వెలుగోడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న టీచర్ బి.సుబ్రహ్మణ్యంను తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యంను స్కూల్ అసిస్టెంట్ కోటాలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి ఈ నెల 5వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం సుబ్రహ్మణ్యంను స్థానిక హైస్కూల్లో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణరావు, టీచర్లు రవిశంకర్, ఫైజుల్లా, రామకృష్ణ, నరసింహులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే ప్రారంభం



రీసర్వే పనులకు పూజ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, శివపురం గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టిన భూ రీసర్వే పనులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో టీములుగా ఏర్పడి పకడ్బందీగా భూ రీసర్వే పనులు చేయిస్తున్నామన్నారు. కొత్తపల్లి గ్రామానికి 5, శివపురం గ్రామానికి 3 టీములను ఏర్పాటు చేసి రీసర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీర్వోలు లింగేశ్వర్, బాబు మియా, మౌలాలి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోర్ల ఏర్పాటు



శ్మశాన వాటికలో బోరు తవ్వుతున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలోని 8 కులాలకు చెందిన శ్మశానవాటికలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకారంతో మూడు బోర్లు తవ్వించి ఏళ్ల కాలం నాటి సమస్యను పరిష్కరించినట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రెటరీ మురహరి రాజన్న తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి గ్రామంలో 8 కులాలకు చెందిన వారికి శ్మశానవాటికలున్నట్లు తెలిపారు. అంత్యక్రియల అనంతరం కనీసం కాళ్లు, చేతులు కడుక్కుందామన్నా నీటి వసతిలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే మూడు బోర్లు మంజూరు చేయించినట్లు తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

మహానంది: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఎస్‌ఐ మల్లికార్జున హెచ్చరించారు. మండల పరిధిలోని నారాయణాపురం, సంతజూటూరు గ్రామాల్లో ఎస్‌ఐ మల్లికార్జున బుధవారం రాత్రి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వర్షం.. పంటలకు జీవం

- డివిజన్ పరిధిలో జోరుగా వర్షాలు
- పైర్లు ఏపుగా పెరిగేందుకు దోహదం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆత్మకూరు: ఈ ఏడాది ఆగస్టు నెలలో వర్షాలు లేక డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టడంతో అన్నదాలు ఆందోళన చెందారు. అయితే సెప్టెంబర్ నెల ప్రారంభమైన తొలివారంలోనే వరుణుడు అనుగ్రహించడం.. నాలుగు రోజులు వరుసగా వర్షాలు కురవడంతో ఎండుతున్న పంటలకు జీవం వచ్చినట్లయ్యింది. ఈ వర్షాలు పైర్లు ఎపుగా పెరిగేందుకు దోహదపడుతుండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో అన్నదాతలు పత్తి, మొక్కజొన్న, వరి , కంది, సోయాచిక్కుడు, పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పంటలు ఈ వర్షాలకు కళకళలాడుతున్నాయి.

వర్షాలకు కళకళలాడుతున్న పైర్లు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో వర్షాలకు పంటలు జీవం పోసుకోవడంతో కళకళలాడుతున్నాయి. వర్షాలు లేక ప్రతి పైరు ఎండలకు వాడిపోవడంతో కళాహీనంగా ఉండేది. ప్రస్తుతం వర్షాలకు పంటలు పెరిగి కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ లో డివిజన్ నందు మొక్కజొన్న పంట దాదాపుగా 20 వేల ఎకరాలకు పైగా, సోయాబీన్ 5 వేల ఎకరాలు, పత్తి 2 వేల ఎకరాల్లో , మెట్టవరి 5 వేల ఎకరాల్లో, కంది 2 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. ప్రస్తుతం ఈ వర్షాలకు పంటలు ఏపుగా పెరుగుతున్నాయి.



ఏపుగా పెరిగిన మెట్టవరి పంట



వర్షాలకు కళకళలాడుతున్న పత్తి పంట

జోరుగా కురిసిన వానలు

ఆత్మకూరు మండలంలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు వర్షాలు కురిశాయి. 2వ తేదీ 5.2 మి.మీ, 3న 17.8 మి.మీ, 4న 63.4 మి.మీ, 5న 33.8 మి.మీ, 6వ తేదీ 22.6 మిమీ వర్షం కురిసింది. ఇలాగే వెలుగోడు మండలంలో మొత్తం 3 రోజుల్లో 94.6 మి.మీ, మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో దాదాపు 90 మి.మీలకు పైగా వర్షం కురిసింది.

ఎరువుల కోసం రైతన్నల పరుగు

వర్షాలు జోరుగా కురడంతో పంటలపై రైతులు తిరిగి ఆశలు పెంచుకున్నారు. పొలాలకు రసాయన ఎరువులు వేస్తే పంట పెరిగి చేతికి వస్తుందనే నమ్మకంతో రైతులు ఎరువులకోసం ఆర్బీకే, ప్రైవేట్ దుకాణాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుతం ప్రధానంగా కాంప్లెక్స్ ఎరువుల కంటే యూరియాకు అధిక డిమాండ్ ఉండడంతో అధిక ధరలకు వ్యాపారస్తులు విక్రయిస్తున్నా తప్పని స్థితిలో కొనుగోలు చేసి పొలాల్లో చల్లుతున్నారు. కొందరు మొక్కజొన్నకు యూరియాతో పాటు 2020-13, పొటాష్ కూడా కలిపి కూలీల సహాయంతో చల్లుతున్నారు.

పంటలు ఏపుగా పెరుగుతున్నాయి



మొక్కజొన్న, పత్తి, మెట్టవరి పంటలు ఈ వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయి. పంటలు పెరుగుదలకు ఈ వర్షాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నెల వారం, 10 రోజుల పాటు వర్షాలు కురవనప్పటికీ రైతన్నలకు ఇబ్బంది ఉండదు. ఈ నెలలో ఉత్తర కార్తె ఉండడంతో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉంది. ఈ నెల చివరలో కూడా వర్షాలు కురిస్తే అంతో ఇంతో చేతికి పంటలు వస్తాయి. – ఈశ్వర్, ముష్టపల్లి

ఎరువులు వాడితే పంటకు మేలు



వర్షాలకు ఎరువులు వాడడం పంటకు ఎంతో మేలు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, మిర్చి, మెట్టవరి, సోయాబీన్ లాంటి పంటలకు యూరియా వాడడం వలన వాడిన పంటలు తిరిగి ఏపుగా పెరిగే అవకాశం ఉంది. ఇతర కాంప్లెక్స్ ఎరువులైన 19-19-19 , 20-20-013, 14-35-14, 28-28-0 లాంటి ఎరువులు వాడితే పంట వేర్లకు బలంతో పాటు పైరుకు కావాల్సిన పోషకాలు అందుతాయి. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటాం.

-ఏడీఏ ఆంజనేయులు

మహానందీశ్వరుడి సన్నిధిలో వెండి తులాభారం

మహానంది: ఆళ్లగడ్డ నియోజకవర్గం చింతకుంట్ల గ్రామానికి చెందిన ఇంజేటి నాగిరెడ్డి, సిరిచందన దంపతులు తమ కుమారుడు తాత్విక్‌దేవ్ పుట్టినరోజు పురస్కరించుకుని బుధవారం మహానందీశ్వరుడి సన్నిధిలో వెండి తులాభారం నిర్వహించారు. తమ కుమారుడిని త్రాసులో కూర్చోబెట్టి బరువుకు సరిపడా 11కిలోల వెండిని సమర్పించారు. తులాభారం త్రాసును విరాళంగా ఇచ్చిన దాతలే తొలి తులాభారం మొక్కును చెల్లించుకున్నారు. వేదపండితులు రవిశంకర అవధాని, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున పాల్గొన్నారు.



తులాభారం ద్వారా వెండి సమర్పిస్తున్న ఇంజేటి నాగిరెడ్డి దంపతులు

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

- రూ.3.51 లక్షలు అందజేసిన కాంప్లెక్స్‌లోని దుకాణదారులు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని గత బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం 14 షాపులు పూర్తిగా అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఆ కాంప్లెక్స్‌లోని మిగతా దుకాణదారులందరూ కలిసి రూ.3,51,624లు పోగుచేసి బాధితులకు మంగళవారం రాత్రి ఆర్థిక సహాయం అందజేశారు. 14 షాపుల వారు రూ.లక్షల్లో కూడగట్టుకున్న వస్తు సామగ్రి అంతా కాలిపోవడంతో లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్‌లోని వ్యాపారస్తులంతా కలిసి కట్టుగా తమ వంతుగా ఒక్కొక్కరికి రూ.27,116లు చొప్పున అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కాగా, అగ్నిప్రమాద ఘటన జరిగిన అనంతరం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి 14 షాపుల వ్యాపారులకు తమ వంతుగా రూ.20వేల చొప్పున రూ2.80లక్షలను తక్షణ సాయంగా అందజేశారు. అలాగే ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి రూ.1.40 లక్షలను తన వంతుగా ఇచ్చారు.

భూ రీ సర్వేను విజయవంతం చేయండి



కరివేనలో భూ రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్

ఆత్మకూరు: భూ రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని కరివేన, వడ్లరామాపురం గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేకు సంబంధించి రైతులతో చర్చించి ఎలాంటి విభేదాలు లేకుండా సర్వే కొనసాగించాలన్నారు. రైతులు సర్వేకు సంబంధించి ఏమైనా సమస్యలు తీసుకువస్తే తమ దృష్టికి తేవాలన్నారు. అధికారులు సక్రమంగా సర్వేలు నిర్వహించి, ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో 40.6 మి.మీ వర్షపాతం

పాములపాడు: పాములపాడు మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 40.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. అల్పపీడనం ప్రభావం వల్ల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల పంటలకు అనుకూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగుచేసిన పంటలు కురుస్తున్న వర్షాలదాటికి పచ్చగా కళకళలాడుతున్నాయి.

పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

జూపాడుబంగ్లా: అల్పపీడన ప్రభావం వల్ల మండలంలోని వివిధ గ్రామాల్లో మూడు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో నీళ్లు నిలిచాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 16.6 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని పాములపాడులో అత్యధిక వర్షపాతం నమోదు కాగా నందికొట్కూరు మండలంలో అత్యల్పంగా 9.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు తెలిపారు. కొత్తపల్లిలో 20.6 ఎం.ఎం, పగిడ్యాలలో 17.8ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. మిడుతూరు మండలంలో వర్షపాతం నమోదు కాలేదని తెలిపారు.



తంగడంచ పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

రూ.20 లక్షలతో సీసీ రోడ్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని సచివాలయం -2 పరిధిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. పలు వీధుల్లో వేస్తున్న రోడ్లను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో కాకుల సెంటర్, శ్రీశైలమాత పాఠశాల, వైజాగ్ క్యాంప్, పశువైద్యశాల తదితర ప్రాంతాల్లో రోడ్లను నిర్మిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, కన్వీనర్లు బి.గౌస్‌మొహిద్దీన్, నసిమున్నీసా, బద్రూనాయక్, ఆటోమల్లి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 7, 8 తేదీల్లో గుంటూరులో జరిగే ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ కోరారు. బుధవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. సదస్సుకు నంద్యాల జిల్లా నుంచి విద్యార్థులు తరలిరావాలని పిలుపినిచ్చారు.

మహానంది ఆలయంలో ఘర్షణ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు, సిబ్బంది మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. అనంతపురం జిల్లా నార్పల మండలానికి చెందిన భక్తులు మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చారు. ఆ సమయంలో స్వామి, అమ్మవార్లకు మహామంగళహారతుల సేవ జరుగుతోంది. హారతుల సమయంలో ఆర్జిత సేవా టికెట్లు కొనుగోలు చేసి వెళ్లాల్సి ఉంటుందని, కాసేపు ఆగితే ఉచిత, సాధారణ దర్శనం ఉంటుందని సిబ్బంది భక్తులకు చెప్పారు. అయినా వారు వినకుండా తాము టికెట్లు కొనమని సిబ్బందితో దురుసుగా మాట్లాడటంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఉద్యోగులు మహానంది, జనార్దన్, శివ, ఈశ్వర్‌లపై దాడికి దిగారు. దాడి చేసిన వారిని స్థానిక ఉద్యోగులు పోలీసుల సాయంతో పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. కొందరు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ఇరువర్గాలతో మాట్లాడారు. చివరికి నంద్యాలకు చెందిన ఓ విద్యాసంస్థల అధినేత జోక్యంతో దాడి చేసిన భక్తులు సిబ్బందికి క్షమాపణలు చెప్పించడంతో సమస్య సద్దుమణిగింది.

గృహసారథులకు బీమా

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం పనిచేసే జేసీఎస్, గృహసారథులకు వైఎస్సార్ బీమా వర్తింపజేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వడ్లరామాపురం, కురుకుంద గ్రామాల్లోని సచివాలయాల్లో జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విస్తృతంగా ప్రభుత్వ పథకాలను వివరించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి

మల్లన్నను దర్శించుకున్న ఏపీ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ



మల్లన్న దర్శనార్థం వస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

మాతాశిశు మరణాలు చోటు చేసుకోరాదు

నంద్యాలటౌన్: మాతా శిశు మరణాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణుల ప్రసవ ప్రణాళికను రూపొందించి వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలని చెప్పారు. అలాగే శిశులకు వ్యాక్సిన్‌లు సకాలంలో వేసి వివరాలు నమోదు చేయాలన్నారు. ఆశా, ఏఎన్‌ఎంలకు కేటాయించిన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, 5 ఏండ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు వేయాలని సూచించారు. పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, కుటుంబ వైద్య విధాన నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్ చంద్ర, డాక్టర్లు శ్రీమంత్, కాంతారావు, ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేస్తాం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఉర్దూ డీఐ పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తెలిపారు. బుధవారం నంద్యాలలో రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్సీ ఇసాక్ బాషాను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలకు ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. అర్హత గల ఔత్సాహిక ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా అధికారులను వెంటనే సంప్రదించాలన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు జమాన్, ప్రధాన కార్యదర్శి దస్తగిరిబాషా, నాయకులు మహబూబ్‌బాషా, ఫయాజ్ హలీ, కలీముల్లా, అనీఫ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, భక్తులు

నందికొట్కూరు: నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో శ్రీ ఆచార్య ప్రబోధానంద ఆశ్రమం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణుడి జయంతి వేడుకల ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భక్తులు వాడాల వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ బాండ్స్ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు వీ.ఆర్ శ్రీను, చింత శ్రీను, మాజీ కౌన్సిలరు చింత తులసమ్మ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: శ్రీకృష్ణాష్టమిని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ ఆవరణలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి వాహనాలపై కృష్ణభగవానుని చిత్రపటాలను ఊరేగించారు.

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు పలు గ్రామాల్లో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకం, తదితర విశేషపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. చిన్నికృష్ణుని వేషధారణలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు శ్రీకృష్ణుని ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్ల ముంగిట కళ్లాపి చల్లి చిన్ని కృష్ణుని తమ ఇళ్లలోకి ఆహ్వానించే విధంగా రంగువల్లులు తీర్చి దిద్దారు.

కొత్తపల్లి: శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని స్థానిక రాధాకృష్ణ ఆలయంలో కల్యాణం నిర్వహించారు. నందికుంట, పెద్దగుమ్మడాపురం నారాయస్వామి ఆశ్రమమంలో కృష్ణాష్టమి సేవా సమితి ఆధ్వర్యంలో, చిన్నగుమ్మడాపురం, దుద్యాల, ఎర్రమఠం గ్రామాలలో రాధాకృష్ణుల విగ్రహాలను ఊరేగించారు.

మహానంది: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో బుధవారం వేడుకలు వైభవంగా జరిగాయి. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో పురోహితులు, అర్చకులు రఘుకుమారశర్మ ఆధ్వర్యంలో కృష్ణభగవానుడికి అలంకార పూజ, హారతులు, అభిషేకం పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామివారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు తోటగేరిలో తొట్టి పడగొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు ప్రఖండ అధ్యక్షులు గరుడాద్రి సుదర్శన్, ఆవులరెడ్డి, కాంతారెడ్డి, శ్రీనివాసగౌడ్, వెంకటేశ్వర్లు, రాజేష్, తదితరులుపాల్గొన్నారు.



గుమ్మడాపురం గ్రామంలోని నారాయణస్వామి ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకల దృశ్యం



ఆత్మకూరులో చిన్నారితో ఉట్టి పగులగొట్టిస్తున్న దృశ్యం

కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

పగిడ్యాల: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయుసీ భవనంలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరుతో దారి మళ్లిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికులు మరణిస్తే ప్రమాద బీమా కింద రూ. 5 లక్షలు, సహజంగా మరణిస్తే రూ. 2 లక్షలు మంజూరు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు శాలుమియ్య, వెంకటేశ్వర్లు, ముర్తుజావలి, చాంద్ బాష, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

8న వ్యూహలక్ష్మీ హోమం

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన వ్యూహలక్ష్మీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి 4 శుక్రవారాలు శ్రీచక్ర యంత్రంతో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మాసంలో నాలుగో శుక్రవారం రోజైన 8వ తేదీన అత్యంత శక్తివంతమైన వ్యూహలక్ష్మీ దేవి అర్చన అభిషేకం, హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ హోమంలో పచ్చ కర్పూరం, శ్రీగంధం, శ్రీఫలాలు, 108 తామర గింజలు, కలువ పూలు, 108 గంధం చెక్కలు, అష్ట ద్రవ్యాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే వారు రూ.2516 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు ఉద్యాన పంటల కలెక్షన్ సెంటర్ ప్రారంభోత్సవం

జూపాడుబంగ్లా: ఉద్యానవన పంటలు సాగుచేసే రైతుల సౌకర్యార్థం రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను గురువారం నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రారంభించనున్నట్లు ఏపీఎం అంబమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంఐడీహెచ్ 40 శాతం వాటా నిధులు రూ.6లక్షలు, ఆర్‌కేవీవై 35 శాతం వాటా రూ.5.25 లక్షలు, ఎఫ్‌పీఓ వాటా 25 శాతం నిధులు రూ.3.75 లక్షల నిధులు వెచ్చించి కలెక్షన్ సెంటర్‌ను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఏపీఎం అంబమ్మ కోరారు.

నేడు విత్తనాల పంపిణీ

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులకు గురువారం పట్టణంలోని ఏడీఏ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ చేతుల మీదుగా విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ షేక్షావలి తెలిపారు. జిల్లా షెడ్యూల్ కులముల ఆర్థిక ప్రాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు మేకల బండలో వైద్య శిబిరం

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని మేకలబండ చెంచుగూడెంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో నంద్యాల అశ్విని హాస్పిటల్ డాక్టర్ల బృందం పరీక్షలు నిర్వహించి చికిత్సలు, మందుల పంపిణీ చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని మరిన్ని వివరాల కోసం ఎమ్. సుగురేష్, డాక్టర్ మురళీకృష్ణ, ఆరోగ్య శ్రీమెడికల్ కో ఆర్డినేటర్స్ సెల్ 9182642144, 9052676664 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యువకులపై బైండోవర్ కేసులు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో పీర్ల జార్తల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో గతంలో పలు గొడవలకు పాల్పడిన ఆరుగురు యువకులపై బుధవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ జార్తల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.